క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం..

● ఎంఈఓ రాజ్‌కుమార్



పూసపాటిరేగలో ర్యాలీ చేస్తున్న ఎంఈఓ రాజ్‌కుమార్, తదితరులు

పూసపాటిరేగ: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి వాటిని బలోపేతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఎ. రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాల పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. అనంతరం పాత కొప్పెర్ల, గోవిందపురం, కోనాడ గ్రామాల్లో కూడా ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ప్రసన్న

విజయనగరం రూరల్: పిల్లలకు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ ప్రసన్న అన్నారు. మండలంలోని కోరుకొండ సెక్టార్ పరిధి బియ్యాలపేటలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానికంగా చవకగా దొరికే పౌష్టికాహార పదార్థాలపై వివరించారు. చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఐ. కనకమహాలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి



సీమంతం నిర్వహిస్తున్న ఏసీడీపీఓ తవిటినాయుడు, కార్పొరేటర్ సునీత

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు సకాలంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని విజయనగరం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏసీడీపీఓ బి. తవిటినాయుడు అన్నారు. జొన్నగుడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత బారిన పడకుండా ఉండవచ్చన్నారు. అలాగే నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ డి. సునీత, సూపర్‌వైజర్ జి. ఎర్రయ్యమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నెల్లిమర్ల: ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు మరింత ఉత్తమ ఫలితాలు సాధించాలని స్థానిక జూట్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు ఆకాంక్షించారు. స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. ఇంటర్ పరీక్షల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్ ఎం. సత్యనారాయణను అభినందించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలు సాధించడానికి అధ్యాపకులు కృషే కారణమన్నారు. బైపీసీలో బర్ల లలిత రాష్ట్ర స్థాయిలో 989మార్కులు సాధించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో టి. అప్పలనరసయ్య, కె. పద్మనాభం పాల్గొన్నారు.

అమ్మ భాషతో ఆత్మ విశ్వాసం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

విజయనగరం: జీవితంలో ఎదిగేందుకు ఆంగ్ల భాష దోహదపడినా అమ్మ భాషతోనే ఆత్మ విశ్వాసం సాధ్యమని విజయనగరం ఫోర్ట్ క్యాంపస్‌లో గల స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపాల్ బీఎస్‌పీ రాజు అన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతృభాషపై పట్టుసాధిస్తే ఇతర భాషలను సులువుగా నేర్చుకోవచ్చన్నారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, డాక్టర్ జక్కు రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలకు పుస్తకాలు, పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిమ్స్ కంప్యూటర్స్ రాజు, సమితి ఉపాధ్యక్షుడు కాగుపాటి నారాయణమూర్తి, సలహాదారు సుభద్రాదేవి, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కేఎస్‌పీ మూర్తి, కె. హరికృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి..

ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వాడవాడలా అవగాహన ర్యాలీలు చేపట్టారు. అలాగే పరిసరాలను పరిశుభ్రం చేసి పర్యావరణం వల్ల కలిగే మేలును వివరించారు. వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



డెంకాడ: అక్కివరంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్న అధికారులు, గ్రీన్ అంబాసిడర్లు



పూసపాటిరేగ: మండల పరిషత్ కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడిన అధికారులు



పూసపాటిరేగ: మండల కేంద్రంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద అవగాహన సదస్సు



నెల్లిమర్ల రూరల్: కొండగుంపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, తదితరులు



నెల్లిమర్ల రూరల్: తంగుడుబిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



విజయనగరం గంటస్తంభం: పర్యాటక శాఖ కార్యాలయం ఆవరణలో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా పర్యాటకశాఖ అధికారి కె.కుమార్‌స్వామి, తదితరులు



నెల్లిమర్ల: నగర పంచాయతీలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

క్రీస్తుతో ప్రపంచ శాంతి

● ఏఐసీసీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి. ప్రేమానందం



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న ఏఐసీసీ జిల్లా అధ్యక్షుడు ప్రేమానందం, తదితరులు

విజయనగరం టౌన్: క్రీస్తుతో ప్రపంచ శాంతి సిద్ధిస్తుందని ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి. ప్రేమానందం అన్నారు. యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సీనియర్ అడ్వైజర్ రెవరెండ్ డి.డేనియల్ సుదర్శన్ ప్రార్థనతో రన్‌ఫర్ జీసస్ ర్యాలీని శనివారం ప్రారంభించారు. ర్యాలీ స్థానిక మయూరీ జంక్షన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, బాలాజీ జంక్షన్ మీదుగా కోట వరకు సాగింది. ఈ సందర్భంగా భక్తులు ప్రార్థనా గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో రెవరెండ్ బి.ఇమ్మాన్యుయేల్, డి.ఎలీషా, నికోడమస్, సీహెచ్.బలరాం, విజయ, పాల్‌రాజ్, పి.పాల్, స్టీఫెన్, రత్నకుమార్, రాజు, రవి, డేనియల్, పీటర్ అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసెస్

విజయనగరం క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కోట నుంచి సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సాగిన ర్యాలీలో భక్తులు పాల్గొని గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సంఘమిత్ర ఆర్‌ఎస్ జాన్, తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతుకు సహకారం అందిస్తాం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని మామిడి రైతులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరంలోని ఓ హోటల్‌లో మామిడి రైతులు, మామిడి కొనుగోలు దారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మామిడి పంట అధికంగా సాగవుతున్నా ధరలు ఆశాజనకంగా లేవన్నది వాస్తవమేనన్నారు. నాణ్యమైన ఉత్పత్తుల ఎగుమతులకు రైతులు మెలకువలు పాటించాలన్నారు. రసాయనాల వినియోగం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించాలని సూచించారు. మహారాష్ట్రలో పండే అల్ఫాన్సాకు మామిడిలో రారాజుగా పేరు ఉందని, మన బంగినిబిల్లి, సువర్ణరేఖ రకాలు దీనికి పోటీగా తయారు కావాలన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితిరాజశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తులాహ్వానం

చీపురుపల్లి: నిరభ్యంతర భూములను ఆక్రమించుకుని, ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నివాసం ఉంటున్న వారంతా ఆ భూము లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.రాజారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఓ నంబర్ 30 ప్రకారం 2019 అక్టోబర్ 15 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో నిరభ్యంతర భూముల్లో ఆక్రమణలు జరిపి పక్కా నివాసాలు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారికి క్రమబద్ధీకరణ చేయనున్నట్లు తెలిపారు. అలాంటి వారంతా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు 2025 డిసెంబర్ 31 వరకు గడువు ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: అభ్యంతరం లేని భూముల్లో 2019 అక్టోబర్ 15వ తేదీ నాటికి ఇళ్లు నిర్మించుకున్న వారందరూ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో అర్హులైన వారి పేరిట క్రమబద్ధీకరిస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సెలవు రోజు కూడా పన్నుల వసూలు

విజయనగరం: మున్సిపల్ శాఖ ఆదేశాల ప్రకారం ఆదివారం సెలవు రోజైనప్పటికీ.. ఆస్తి, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్ను వసూళ్ల ప్రక్రియ కొనసాగుతుందని కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 – 26 ఆర్థిక సంవత్సరం మొత్తం పన్నును ఒకేసారి చెల్లించినట్లయితే 5 శాతం రాయితీ.. అలాగే 2024 – 25 ఆర్థిక సంవత్సరపు బకాయి పన్ను ఒకేసారి చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సౌకర్యాలు కల్పించాల్సిందే..



సినిమా థియేటర్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుదర్శనరావు, తదితరులు

నెల్లిమర్ల: సినిమా ప్రేక్షకులకు థియేటర్ల యజమానులు అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ పి. సుదర్శనరావు అన్నారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది నగరపంచాయతీలోని సినిమా థియేటర్‌ను శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ పి. వేణుగోపాల్, వీఆర్‌ఓ గోవింద్, వీఆర్‌ఏ సూరి, తదితరులు పాల్గొన్నారు.

27న సాహిత్య సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య 548 సభలో భాగంగా వాగ్గేయకారుల సామాజిక దృక్పథంపై ఈ నెల 27న స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రఖ్యాత సంగీత కళాకారాణి బురిడి అనురాధా పరశురామ్ సభాధ్యక్షత వహిస్తారన్నారు. ప్రధానవక్తగా మధుర గాయని డాక్టర్ ఎం.ఆముక్తమాల్యద సుష్మ, సమ్మానకర్తగా డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య పాల్గొంటారన్నారు. సాహితీవేత్తలందరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఏడు టన్నుల ఈ వేస్ట్ సేకరణ



విజయనగరం ఫోర్ట్: చెత్త బుట్టలో పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులను వేస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

విజయనగరం: 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ వేస్ట్ సేకరణ కేంద్రానికి అనూహ్య స్పందన వచ్చింది. ప్రజలు స్వచ్ఛందంగా తమ ఇళ్లల్లో ఉండే ఈ వేస్ట్‌ను నగరంలో శనివారం ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలలో అందజేశారు. కార్పొరేషన్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ వేస్ట్ సేకరణ కేంద్రానికి చేరుకున్న కొందరు తమ ఈ వేస్ట్ వస్తువులను కమిషనర్ పల్లి నల్లనయ్యకు అందజేసారు. అలాగే కోట వద్ద మరొక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తంగా రెండు కేంద్రాల ద్వారా 7 టన్నుల ఈ వేస్ట్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. ఈ వేస్ట్ వస్తువులను స్వచ్ఛంధంగా కార్పొరేషన్ అధికారులకు లేదా తమ సచివాలయ పరిధిలో ఉన్న శానిటరీ కార్యదర్శులకు అందివ్వాలని సూచించారు. పాడైపోయిన ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ వస్తువులు ఇళ్లల్లో ఉంచినట్లయితే అనేక అనర్థాలు ఏర్పడతాయన్నారు. వ్యర్థ ఉద్గారాలు వ్యాప్తి చెంది గర్భిణులు, చిన్న పిల్లల ఆరోగ్యాలపై ప్రభావం చూపుతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.



విజయనగరం: ప్రజల నుంచి ఈ వేస్ట్ సేకరిస్తున్న కమిషనర్ నల్లనయ్య

ఎక్కడపడితే అక్కడ పడేయకూడదు

విజయనగరం ఫోర్ట్: పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడేయకూడదని డీఎంహెచ్‌ఓ జీవనరాణి సూచించారు. స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డంపింగ్ ప్లేస్ అని ఒక ప్రాంతాన్ని నిర్ణయించి అక్కడ పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను ఉంచాలన్నారు. వాటిని రీసైక్లింగ్‌కి పంపించి మరలా వినియోగంలోకి తీసుకువస్తారని చెప్పారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డీఎంఓ వై. మణి, డీఎస్‌ఓ కె. సత్యనారాయణ, డెమో వి. చిన్నతల్లి, చంద్రశేఖర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

● సెంచూరియన్‌ను సందర్శించిన ప్రముఖులు..



నెల్లిమర్ల మండలంలోని టెక్కలిలో ఉన్న సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని విశాఖకు చెందిన పలువురు ప్రముఖులు శనివారం సందర్శించారు. వర్సిటీ ప్రెసిడెంట్ డీఎన్ రావు, చాన్స్‌లర్ జీఎస్ఎన్ రాజుతో కాసేపు ముచ్చటించారు. అనంతరం సెంచూరియన్‌లో అమలు చేస్తున్న కోర్సులు, ప్రయోగశాలలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్ రాజా గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ సుగంధ, మేనేజర్ డాక్టర్ గీతా విశ్వనాథన్, సలహాదారు సత్యనారాయణ, స్వస్థ సూచన సంస్థ సీఈఓ డాక్టర్ హరిత, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, వీసీ ప్రశాంతకుమార్ మహంతి, తదితరులు పాల్గొన్నారు. – నెల్లిమర్ల రూరల్

● హిందువులపై దాడులు ఆపాలి..



పశ్చిమబెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ సభ్యులు శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ విభాగ్ విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల కార్యదర్శి కాళ్ల నాగభూషణరావు మాట్లాడుతూ.. సుమారు 200 మందికి పైగా హిందువుల ఇళ్లు, వాణిజ్య దుకాణాలను దోచుకున్నా అక్కడి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. బెంగాల్‌లో శాంతిభద్రతల నియంత్రణను కేంద్ర భద్రతా దళాలకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాశీప్రసాద్, లీగల్ సెల్ అధ్యక్షుడు సరిపల్లి నాగేశ్వరరావు, భజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు. – విజయనగరం టౌన్

కార్మికుల తొలగింపు అన్యాయం



సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న సుధారాణి, నిర్వాహకులు

విజయనగరం గంటస్తంభం: మండల పరిధిలోని జొన్నవలస ప్రభుత్వ పాఠశాలలో 17 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న దుర్గాదేవి స్వయం సహాయక సంఘాన్ని తొలగించడం అన్యాయమని, వెంటనే ఈ చర్యలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా యూనియన్ ప్రధాని కార్యదర్శి బి.సుధారాణి డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని అధికారులను కోరారు. శనివారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏళ్ల తరబడి పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న వారిని తొలగించి, వారి అనుచరులను నియమించుకుంటున్నారని ఆరోపించారు. గతంలో మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలపై ఆందోళన చేసిన సందర్భంలో.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చిరుద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, వేతనాలు పెంచుతామని అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. చిరు ఉద్యోగులను తొలగించే విధానం మాది కాదని చంద్రబాబు ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో కొందరు టీడీపీ నాయకులు తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. జగన్ మోహనరావు, దుర్గాదేవి స్వయం సహాయక సంఘ సభ్యులు కె. సాయిదేవి, పతివాడ శ్యామల, పతివాడ పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత



అటవీశాఖ కార్యాలయంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఫారెస్ట్ అధికారి కొండలరావు, సిబ్బంది

● డీఎఫ్‌ఓ కొండలరావు

విజయనగరం గంటస్తంభం: ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యపడుతుందని డీఎఫ్‌ఓ ఆర్. కొండలరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

'ఈ – వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీ సైక్లింగ్ చేయడం' అనే థీమ్‌ను స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఎన్నుకున్నట్లు చెప్పారు. స్వచ్ఛతను ఒక ప్రజా ఉద్యమంగా చేపట్టడం వల్లే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నాలుగో నెలకు చేరుకుందన్నారు. ఈ వ్యర్థాలను సరైన రీతిలో రీ సైక్లింగ్ చేస్తే పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. సమాచార, సాంకేతిక పరిజ్ఞానం కోసం వినియోగించే కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, మొబైల్ ఫోన్లు, గృహాల్లో వినియోగించే టెలివిజన్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, వీడియో కెమెరాలు, సోలార్ ప్యానళ్లు, తదితర పరికరాలు పనిచేయని పక్షంలో వాటిని వృథాగా వదిలేయకూడదని సూచించారు. అలాగే ఆస్పత్రులు, లేబరేటరీల్లో వినియోగించే రేడియోథెరఫీ, కార్డియాలజీ, డయాలసిస్ పరికరాలను కూడా ఈ వ్యర్థాలుగా పరిగణిస్తామని తెలిపారు. ఇటీవల కాలంలో ఈ తరహా ఎలక్ట్రానిక్ పరికరాలను (ఈ వ్యర్థాలను) వృథాగా వదిలేయడం వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందని, తద్వారా మానవాళి మనుగడకు కూడా హాని కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరికరాల ద్వారా వెలువడే మెర్క్యూరీ, లెడ్, కాడ్మియం, లిథియం, తదితర వాయువులు మానవుల మెదడు, గుండె, కాలేయం, కిడ్నీ, తదితర అవయవాలకు ప్రమాదకరంగా మారనున్నాయన్నారు. ప్రజలందరూ ఈ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసే వారికి అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.